కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



కోకాపేట సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మణికొండ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వానికి 11 సంవత్సరాలు పూర్తి కావటంతో బుధవారం నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.నగేష్‌యాదవ్ అధ్యక్షతన పార్టీ కార్యవర్గ సమావేశాన్ని కోకాపేటలో నిర్వహించారు. నాయకులు ఆదిత్యారెడ్డి, జి.శివరాజ్, భిక్షపతియాదవ్, సాయికిరణ్, కృష్ణగౌడ్, బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ రెడ్డి కాలనీ నూతన కార్యవర్గం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లోని ఏవీఎస్ రెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎంపికచేసుకున్నారు. అధ్యక్షుడిగా దండుగుల ఆంజనేయ, ఉపాధ్యక్షులుగా మంజుల సంజీవ, జనరల్ సెక్రటరీగా దండుగుల శివ, జాయింట్ సెక్రటరీగా మంజుల మల్లేష్, కోశాధికారిగా అలకుంట రాందాస్, సభ్యులుగా డి.హనుమంత్, పి.యాదగిరి, పి.లక్ష్మణ్, ఎం.శ్రీను, డి.వెంకటేష్, యం.రాజు, డి.యాదయ్య, ఒ.మహేశ్, ఎం.తిరుపతమ్మ, పి.భారతి, పి.సూరి, పి.వెంకటేష్ తదితరులను నియమించారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు పని చేస్తుంది.

నాణ్యమైన విద్యనందించేలా పటిష్ట ఏర్పాట్లు

శంషాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

శంషాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించి మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణతో ముందుకెళ్లనున్నట్లు మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. మండల వనరుల కేంద్రంలో బుధవారం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది కన్నా మెరుగైన ఫలితాలు సాధించేలా పూర్తి కార్యాచరణ సిద్ధమైందన్నారు. దానికి అనుగుణంగా విద్యాబోధన కొనసాగిల్సిన అవసరముందన్నారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన ఫర్నిచర్ తదితర సదుపాయలను ఇప్పటికే పరిశీలించామని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే విద్యార్థులను సమీప బడులో చేర్పించామన్నారు. ఇప్పటికే పాఠశాలలకు చేరుకున్న పుస్తకాలు, యునిఫాంలను వెంటనే విద్యార్థులకు అందజేయాలని ఆయన సూచించారు.

ఖాజాగూడ, రాయదుర్గంలో జడ్సీ పర్యటన

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ, రాయదుర్గం, జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని నర్మదా అపార్ట్‌మెంట్స్ సెల్లార్‌లో గత వర్షాకాలం నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో శాశ్వత పరిష్కారంగా స్టార్మ్ వాటర్ డ్రైన్‌లైన్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జోనల్ కమిషనర్‌కు సూచించారు. ఖాజాగూడలోని చెత్త డంపింగ్ యార్డ్ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, దాన్ని వెంటనే తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. రాయదుర్గం బస్తీలో అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ, వాటర్‌పైప్‌లైన్లు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని జెడ్సీ అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్ఈ శంకర్‌నాయక్, హెచ్ఎం డబ్ల్యూఎస్ డీజీఎం నరేందర్‌రెడ్డి, డీఈ విశాలాక్షి, ఎలక్ట్రికల్ డీఈ లక్ష్మీప్రియ, టౌన్‌ప్లానింగ్ అధికారులు రామకృష్ణ, జీషన్, ఎంటమాలజీ ఏఈ తనూజ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



పందెన్‌వాగుకు మహర్దశ

మురుగునీరు కలవకుండా చర్యలు

- రెండు వైపులా అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్‌లు
- స్థలాలు ఉన్న చోట గ్రీనరీ
- వంతెనల విస్తీర్ణం పెంపు
- దోమలు, దుర్గంధం దూరం
- రూ. 99 కోట్లతో అభివృద్ధి పనులు



సెక్రటేరియట్ కాలనీలో పారుతున్న పందెన్‌వాగు, ఇరుకుగా ఉన్న కల్వర్టు



రాబోయే రోజుల్లో అభివృద్ధి చెందనున్న పందెన్‌వాగు నాలా ప్రణాళిక చిత్రాలు



మణికొండ: దశాబ్దాలుగా మణికొండ వాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది ఇప్పటి వరకు పందన్ వాగు పక్కన ముక్కులు మూసుకుని దుర్గంధాన్ని, దోమల దండయాత్రను భరిస్తున్న ప్రజలకు త్వరలోనే ఉపశమనం కలగనుంది. మున్సిపాలిటీ పరిధిలో సాయివైభవ్, పంచవటి, సాయిలక్ష్మీ, ట్రయల్స్ విల్లాస్, శ్రీనివాసనగర్, ఎంప్లాయిస్ కాలనీ, శివసాయి కాలనీ, సెక్రటేరియట్ కాలనీ, బయోడ్‌కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఈవీవీ కాలనీ, ఫ్లోటిల్లా గేటెడ్ కమ్యూనిటీలు ఎదుర్కొంటున్న దుర్గంధం, దోమల సమస్యలకు చెక్ పెట్టేందుకు మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ఆయా కాలనీల వారీగా ప్రవహిస్తూ దుర్గంధాన్ని వెదజల్లుతున్న పందెన్‌వాగు రూపు రేఖలను మార్చేందుకు ఏకంగా రూ. 99 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఓపెన్‌నాలాగా ఉన్న పందెన్ వాగులో కలుస్తున్న మురుగునీటిని అందులో కలవకుండా రెండు వైపులా పెద్ద సైజులో అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. దాంతో మురుగునీరంతా ఆయా పైపులైన్లలో నెక్నాంపూర్ చెరువు దాటేంత వరకు వెళ్లనుంది. దాంతో ఎక్కడా దుర్గంధానికి తావు లేకుండా కానుంది. రాబోయే రోజుల్లో పందెన్‌వాగులో కేవలం వరద నీరు మాత్రమే వచ్చేలా ఏర్పాట్లు చేయనున్నారు. అక్కడక్కడ నిలుస్తున్న నీటిని నిలువకుండా చేయటంతో దోమల వ్యాప్తిని అరికట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నాలాను రెండు వైపులా సిమెంట్ వాల్‌లను నిర్మించనున్నారు. దాంతో నీటి నిలువ లేకుండా అయి నాలా వారిగా ఉన్న కాలనీల ప్రజలకు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోనున్నారు.

నాలా పక్కన శోభాయమానం...

ల్యాంకోహిల్స్ నుంచి ప్రారంభమయ్యే పందెన్ వాగు నాలాలో శివపురి కాలనీ వద్ద బుల్కాపూర్ నాలా నీరు కలుస్తుంది. అక్కడ నుంచి పంచవటి కాలనీ వారిగా ఉన్న నాలా విస్తీర్ణం ఎక్కువగా ఉన్న చోట మినీ నందన వనాలు, పార్కులు, పూల మొక్కలు, పలు రకాల మొక్కలను అభివృద్ధి చేయనున్నారు. దాంతో వాటి పక్కన ఉన్న కాలనీలవాసులు ఉదయం, సాయంత్రం సమయాల్లో సేద తీరటంతో పాటు ఆట స్థలాలు, ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో అధికారులు ఉన్నారు. నాలాకు ఇరువైపులా కాంక్రీంట్ వాల్‌లు, అండర్ గ్రౌండ్‌లో డ్రైనేజీ, నీరు ఎక్కడా నిలబడకుండా చర్యలు, నాలా వారిగా నందన వనాల అభివృద్ధితో అది శోభాయమానంగా మారనుంది. నాలాలో ఎలాంటి చెత్త వేయకుండా రెండు వైపులా ఇనుప గ్రిల్‌లను ఏర్పాటు చేయనున్నారు.

రూపురేఖలు మారిపోతాయి



మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీల మధ్య నుంచి ప్రవహిస్తున్న పందెన్‌వాగులో మురికి నీరు కలవటంతో అది దుర్గంధంగా మారింది. దాంతో దుర్వాసన, దోమల వ్యాప్తి విపరీతంగా పెరుగుతుంది. దాంతో దాని రెండు వైపులా కాంక్రీంట్ వాల్‌లతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి మురికి నీటిని వాటి ద్వార మూసీకి తరలిస్తాం. నాలాపై పలు చోట్ల ఉన్న కల్వర్టుల విస్తీర్ణం, ఎత్తును పెంచటంతో రోడ్లు మెరుగవుతాయి. స్థలాలు ఉన్న ప్రతి చోట నందనవనాలు, సిట్టింగ్ ఏరియాలు, మినీ పార్కులు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తాం. దాంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఉదయం, సాయంత్రం సమయాల్లో సేద తీరేలా తయారు చేస్తాం. వచ్చే నెలలో పనులు ప్రారంభించి ఏడాదిలో పూర్తి చేస్తాం. అపుడు మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీల రూపురేఖలు మారిపోతాయి.

– డి.ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

పెరగనున్న కల్వర్టుల విస్తీర్ణం..

పందెన్‌వాగుపై మొత్తం 8 చోట్ల ఇప్పటికే కల్వర్టులు ఉన్నాయి. వాటిల్లో మూడు చోట్ల పరవాలేదనేలా ఉన్నా ఐదు చోట్ల లోతట్టుగా, తక్కువ విస్తీర్ణంతో ఉన్నాయి. దాంతో ఇదే ప్రణాళికలో సెక్రటేరియట్ కాలనీలో మూడు చోట్ల, వెంకటేశ్వర కాలనీ, కేజీఎన్ జిరాక్స్ వద్ద, ఈవీవీ కాలనీ పక్కన ఉన్న ఐదు కల్వర్టుల ఎంతు పెంచటంతో పాటు వాటిని మరింత వెడల్పుగా విస్తరించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. పందెన్ వాగు అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, కల్వర్టుల విస్తీర్ణం లాంటి అన్ని పనులు ఒకే టెండర్‌లో, ఒకే కాంట్రాక్టర్ చేసేలా టెండర్ పిలిచారు. రూ. 99 కోట్లతో పనులు చేపడుతుండటం, ఇప్పటికే టెండర్‌లు పిలవటంతో పలువురు పెద్ద కాంట్రాక్టర్‌లు వచ్చి చేయాల్సిన పనులను చూసి వెళ్లారు. ఈ నెల 21వ తేదీన టెండర్‌లు తెరవగానే ఒకరు పనులు దక్కించుకుని వాటిని చేపట్టే అవకాశం ఎక్కువగా ఉందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. దాంతో మరో ఏడాది కాలంలో పందెన్‌వాగు రూపు రేఖలు మారిపోయి మున్సిపాలిటీలో నెలకొన్న దుర్వాసన, దోమల బెడద పూర్తిగా తీరుతుందని ఆశిద్దాం.

కాంగ్రెస్‌లో కష్టపడే వారికి పదవులు



శ్రీనుగౌడ్‌ను సన్మానిస్తున్న బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

మైలార్‌దేవ్‌పల్లి: టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సభ్యులను బుధవారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సన్మానించారు. టీపీసీసీ నూతన కార్యదర్శిగా నియమితులైన శ్రీనుగౌడ్, సదాలక్ష్మీలను ఆయన మైలార్‌దేవ్‌పల్లిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపుతో పాటు పార్టీ పదవులు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో నేతలు నరేందర్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమ అమలుపై సమీక్ష

రాజేంద్రనగర్: జీపీఎస్ రాజేంద్రనగర్ పాఠశాలలో ఈ నెల 6వ తేదీ నుంచి బుధవారం వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను వివరించారు. అనంతరం బడిబాట సమీక్షా అంబేద్కర్ కాలనీలోని గ్రంథాలయంలో నిర్వహించారు. గ్రంథాలయ కో–ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, సంఘ సేవకులు కాలిచరణ్ వారి అభిప్రాయాలను తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయుల బృందం గ్రంథాలయాన్ని సందర్శించింది. గ్రంథాలయంలో విద్యార్థులకు కావాల్సిన కథల పుస్తకాలు బొమ్మలతో ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. రంగారెడ్డి జిల్లా సెక్రటరీ రాణి గ్రంథాలయానికి సరిపడా పుస్తకాలు అందించి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పాఠశాల హెచ్ఎం సి.నర్సింహులు, ఉపాధ్యాయులు సి.విద్యావతి, వి.అరుణ, ఎం.విజయ్‌కుమార్, జి.దీపిక, బి.భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని, ప్రతి మున్సిపాలిటీలో అవసరమైన అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2, 3, 5, 6, 7, 13, 14వ డివిజన్‌లలో మొత్తం రూ. 7.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. హిమగిరినగర్ పెద్దమ్మ టెంపుల్, కపిల్‌నగడర్, ఎల్ఎస్ఎస్ కాలనీ, పీఎస్‌టీ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీ హిల్స్‌లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రోడ్డు వైడనింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, సీసీ రోడ్లతో పాటు అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ శరత్‌చంద్ర, మాజీ మేయర్, మాజీ డిప్యూటీ మేయర్, మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడండి

మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బుద్వేల్ స్టేషన్ వెనుక నేతాజీనగర్ వ్లే రోడ్డుపై మురుగ నీరు ప్రవహిస్తున్నది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆయా సమస్యలతో సతమతం అవుతుంటే అధికారులు స్పందించక పోవడం దారుణమన్నారు. డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జగన్, పురుషోత్తంరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తలారి చిన్న, బాలకృష్ణ, రాంబాబు, రాజు, వెంకటరమణ, సురేష్, పరమేష్, అనంతం, అంజిరెడ్డి, శంకర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహ్మమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బీఆర్‌ఎస్ శ్రేణుల ర్యాలీ

మణికొండ: ప్రాణాలను తృణప్రాయంగా భావించి రాష్ట్ర సాధనకు అవిశ్రాంత పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించటంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కాళేశ్వరంపై ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ విచారణ చేయటం దారుణమని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. బుధవారం కమిషన్ విచారణకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంఘీభావంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి పిలుపుతో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రాష్ట్రాన్ని సశ్యశామలం చేశారన్నారు. దేశంలోనే అత్యధిక ధాన్యం పండుతున్న రాష్ట్రంగా తెలంగాణను నిలిపిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. సాగు నీరు, తాగునీటిని అందించిన ప్రాజెక్టుకు కొంత ఇబ్బంది అయినంత మాత్రాన దాన్ని సరిచేయాల్సిన ప్రస్తుత ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోకుండా దానిపై రాద్ధాంతం చేయటం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో...

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టి విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అక్రమాలపై ప్రభుత్వం నియమించిన జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విచారణకు హాజరుకావడానికి బీఆర్‌కే భవన్‌కు వస్తున్న సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నేతలు సుభాష్‌రెడ్డి, రమేష్‌ముదిరాజ్, రాముయాదవ్, సోమ శ్రీనివాస్, రఘుయాదవ్, మైసిరెడ్డి, ఎడ్లకాడి సూర్యం, గుమ్మడి కుమార్, జి.రాము, జగదీష్, ప్రవీణ్, భగవాన్‌దాస్, దుర్గేష్, భూదవి, సరిత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌కు సంఘీభావంగా ర్యాలీగా వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



మైలార్‌దేవ్‌పల్లి నుంచి తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మోదీ నేతృత్వంలో శక్తిమంతంగా భారత్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మణికొండ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ, ఆర్థిక పరమైన అంశాలతో దేశం అన్ని రంగాలలో శక్తిమంతంగా మారుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ బీజేపీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడచిన దశాబ్ద కాలంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు, ఆర్టికల్–370 రద్దు, త్రిబుల్ తలాక్ రద్దు, రామజన్మభూమిలో రామ్‌లల్లా ఆలయ నిర్మాణం, సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్ వంటి ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుందన్నారు. దేశంలో రైల్వే, విమానాశ్రయాలు, రోడ్లు, వంతెనలు వేగంగా అభివృద్ధి చెందాయన్నారు. పేద ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం నిరాటంకంగా అందుతున్నాయన్నారు. జన్‌ధన్ ఖాతాలతో పేదల ఆర్థిక శక్తిని పెంపొందించారన్నారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. ఈ నెల 23వ తేదీన బలిదాన్ దివస్, 25వ తేదీన గతంలో కాంగ్రెస్ పెట్టిన ఎమర్జెన్సీ పాలన దుష్ఫలితాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించే యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చేయాలన్నారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌స్వామి, జె.సిద్ధప్ప, సి.బీరప్ప, లక్ష్మీ, ఇందిర, అనితాదేవి, ఎం.రాఘవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, రాజేశ్, బి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాబుద్ధులతోపాటు ఉద్యోగావకాశాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పించి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేలా ప్రోత్సహిస్తున్నామని మహవీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో టెక్ మహేంద్ర కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించింది. కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థులను జాబ్‌మేళాలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహవీర్ కళాశాల అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యాబోధన మౌలిక సదుపాయాలు కల్పించటం ద్వారా రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు సాధించుకుందన్నారు. ఈ నేపథ్యంలోనే మంచి కంపెనీలు ప్లేస్‌మెంట్‌కు రావడం విద్యార్థులకు ఉపయోగకరమని అన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, టీపీవో డాక్టర్ ప్రతిభాభారతి, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ నందగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి

పాల్మాకులలో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట'



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, మహిళలు



మైలార్‌దేవ్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండల పరిధిలోని పాల్మాకులలో బుధవారం 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కల్పించే బోధన సౌకర్యాలు, పౌష్టికాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి అవగాహన కల్పించారు. రెండేళ్లు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలను పంపించాలని సూచించారు. ఈ వయస్సు కల్గిన వారిని గుర్తించి అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుని ఐదేళ్లు పైబడిన చిన్నారులను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, కవిత, ప్రేమలత, సుమలత, అరుణ, ఆయాలు, స్వయం సహాయక సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్ శేరిలింగంపల్లి ప్రాజెక్టు పరిధిలో బుధవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి, తల్లుల పాత్రను గుర్తించేందుకు, బాలల ఆరోగ్యం, విద్యపై దృష్టి పెట్టేందుకు ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలిపురం అంగన్‌వాడీ కేంద్ర టీచర్ సునీత, పద్మశాలిపురం–1 టీచర్ కూడికల రాజేశ్వరి, పద్మశాలిపురం–2 టీచర్ టి.వెంకటమ్మ, బాబుల్‌రెడ్డినగర్ సెంటర్–1 టీచర్ కనకవ్వ(లక్ష్మి), సెంటర్–2 టీచర్ అనితలు తమ కేంద్రాల్లో పిల్లలతో అనేక సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో పిల్లలు, తల్లులచే ఆరోగ్య నినాదాలతో కూడిన ర్యాలీలు చేపట్టారు. పద్మశాలిపురం, బాబుల్‌రెడ్డినగర్‌ల ప్రాంతాల్లో వీధివీధిగా ప్రభాత ర్యాలీ నిర్వహించి స్థానికులకు అంగన్‌వాడీ సేవలపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీవో కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, శారదాలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ప్రభావం పిల్లల ఆరోగ్యంపై వారి భవిష్యత్తు విద్దయపై ఎంతో ఉంటుందన్నారు. మాతభాషలో మొదటి దశ విద్యను ఇవ్వడం, పోషకాహారం అందించడం ద్వారా సమగ్ర అభివద్ధికి బీజాంశం వేయబడుతుందన్నారు. ఈ తరహా కార్యక్రమాలు తల్లుల్లో, స్థానిక మహిళల్లో, యువతలో చైతన్యం కలిగిస్తాయన్నారు. అంగన్‌వాడీలను శక్తివంతంగా ఉపయోగించుకోవడం సమాజ బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో బొల్ల వెంకటేష్, అంగన్‌వాడీ ఆయాలు ఎ.లక్ష్మి, సి.హెచ్.మంగదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.